నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 22: సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు గాంధీనగర్‌లో బాలెంల కృష్ణ, ప్రమీల దంపతుల సహకారంతో 50 మంది నిరుపేద మహిళలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ శనివారం రాత్రి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ నాయకులు పెద్దపంగు పూర్ణశశికాంత్, విజయ రెశిష్టు, ఎలియా పాస్టర్, యేసురాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం

● అదనపు కలెక్టర్ రాంబాబు

వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట, డిసెంబర్ 22: పేదల సమస్యల పరిష్కారం కోసం కృషిచేసిన కేంద్ర మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి సేవలు చిరస్మరణీయమని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. అదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గడ్డం వెంకటస్వామి వర్ధంతిని నిర్వహించారు. వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వెంకటస్వామి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, దున్న శ్యామ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో వెంకటస్వామి చిత్రపటానికి అదనపు ఎస్పీ ఎం.నాగేశ్వర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ సురేశ్, అన్వర్, సాయిరామ్, సీసీలు సందీప్, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేరేడుచర్ల: స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో వెంకటస్వామి వర్ధంతిని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్‌పర్సన్ అలక సరిత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

నాగారం, డిసెంబర్ 22: ఎస్సారెస్పీ కాల్వలకు తక్షణమే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే రైతులు నార్లు పోశారని, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు చొరవ తీసుకొని వెంటనే నీటిని విడుదల చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. నీటి విడుదలతో తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో అంతర్గత రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని, గురుకుల పాఠశాలలో సరైన ఆహారాన్ని అందించడంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, పులుసు సత్యం, కందాల శంకర్‌రెడ్డి, మండల కన్వీనర్ దేవరకొండ యాదగిరి, జి.వెంకటేశ్వర్లు, మల్కాపురి మహేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

● ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 22: విద్యార్థులు జీవితంలోఉన్నత లక్ష్యాలను ఎంచుకొని, వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని మండల విద్యాధికారి శేషగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి నిర్వహించిన ఆనంద్ విద్యా మందిర్(ఏవీఎం) 62వ వార్షికోత్సవ వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలని, అదే ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చేస్తుందన్నారు. చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యేసు క్రీస్తు జనన, మరణాల నాటికలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు ఎంఈఓ చేతులమీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రెసిడెంట్ శాంత మేరి, శివకుమార్, పాస్టర్ మరియన్న, సిస్టర్ విజయ, హెచ్ఎం ఫాతిమా పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులకు బెనిఫిట్స్ అందించేందుకు కృషి

● ఎస్‌బీఐ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్

నల్లగొండ, డిసెంబర్ 22: ఎస్‌బీఐ ఉద్యోగులకు అందాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ అందించేందుకు కృషి చేస్తానని బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇంద్రారెడ్డి ఫంక్షన్‌హాల్లో ఆదివారం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన ఎస్‌బీఐ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగులు కష్టమర్ల సేవల విషయంలో రాజీ పడవద్దన్నారు. వచ్చే నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఉద్యోగులు క్లాక్‌టవర్ నుంచి ఫంక్షన్‌హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో సంఘం రీజినల్ కార్యదర్శి సురిగి నర్సింహగౌడ్, అసిస్టెంట్ రీజినల్ కార్యదర్శి సుమన్ కుమార్, ట్రెజరర్ శాండిల్య, ప్రవీణ్, జగన్ సింగ్ పాల్గొన్నారు.

ఏఎస్ఐతో యువకుల దురుసు ప్రవర్తన

● పోలీసుల అదుపులో ఇద్దరు.. పరారీలో మరొకరు

కోదాడ రూరల్, డిసెంబర్ 22: ఓ ఏఎస్ఐతో ముగ్గురు యువకులు దురుసుగా ప్రవర్తించిన ఘటన ఆదివారం రాత్రి కోదాడ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని రామాలయం సమీపంలో రోడ్డు పక్కన వ్యాపారం నిర్వహిస్తున ఓ వ్యక్తితో ముగ్గురు యువకులు ఘర్షణకు దిగారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ వారిని నిలువరించేందుకు ప్రయత్నించగా దురుసుగా ప్రవర్తించారు. ఏఎస్ఐ బైక్ తాళం తీసుకున్నారు. దీంతో ఆయన పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరో యువకుడు పరారయ్యాడు. కాగా, యువకులు మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తిరుమలగిరి, డిసెంబర్ 22: మండల కేంద్రంలోని నలంద పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

సూర్యాపేటలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 22: జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల మైదానంలో భానుపురి ప్రీమియర్ లీగ్ సీజన్–1 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను మొదటి బహుమతి రూ.లక్ష దాతగా ఉన్న శ్రీరామ్ సాయిరాం ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పది రోజుల పాటు జరగనున్న ఈ క్రీడల్లో రాష్ట్రవ్యాప్తంగా 27 జట్లు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ కంటి ఆసుపత్రి వైద్యులు నాతాల క్రాంతికుమార్‌రెడ్డి, ఉయ్యాల ఉపేందర్, హెడ్ కానిస్టేబుల్ బోస్క సుధాకర్, ఆర్గనైజర్స్ సతీశ్, శ్రీకాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

గరిడేపల్లి, డిసెంబర్ 22: మండల పరిధి పొనుగోడు గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె దశదిన కర్మ ఖర్చులకు గానూ స్థానిక ఎస్సీ కాలనీవాసులు రూ.12 వేలు, 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంసైదులు, సైదులు, నందిపాటి మధు, రాం శ్రీను, నాగేంద్రబాబు, వెంకన్న, మధు, గురవయ్య, గురుస్వామి, రాజు, అరవింద్, నాగరాజు, నరహరి, నవీన్, సుందరయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలి'

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 22: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన నిజమైన కవులను, కళాకారులను గుర్తించి అందరికీ ఉద్యోగావకాశాలు కల్పించేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టాలని ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరాల యాదగిరి, సీనియర్ గాయకుడు నకిరేకంటి చిరంజీవి, టీపీసీసీ సాంస్కృతిక సేన జిల్లా గౌరవాధ్యక్షుడు చెరుకు శైలేందర్ కోరారు. జిల్లాకేంద్రంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ కళాకారులను గుర్తించి అందరికీ ఉద్యోగావకాశాలు కల్పించాలని శాసనమండలిలో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ ప్రస్తావించడంపై హర్షం వ్యక్తం చేశారు. నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సాంస్కృతిక సేన జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక లింగయ్య, కళాకారులు ఆకారపు ఉపేందర్, బోయిళ్ల వెంకటమ్మ, ముల్కలపల్లి సంతోష, ఉయ్యాల శివరామకృష్ణ, ఇరుగు వెంకన్న, గంట నాగలక్ష్మి, జెల్ల సువర్ణ, సారగుండ్ల శ్రీను, కంకణాల అంజి, క్రాంతి, సూరారపు మహేశ్, శాంతి, సరిత, లింగమ్మ పాల్గొన్నారు.

అమిత్ షా పదవికి రాజీనామా చేయాలి

● సీపీఎం మండల కార్యదర్శి సైదులు

మేళ్లచెర్వు ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు

మేళ్లచెర్వు, డిసెంబర్ 22: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ పట్ల అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తూ ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. బాధ్యతాయుత పదవిలో ఉండి లౌకిక విలువలకు వ్యతిరేకంగా మాట్లాడడం భావ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు వెంకటేశ్వర్లు, సైదులు, ప్రజాసంఘాల నాయకులు ఆదినారాయణ, నర్సింహారావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'బంగ్యానాయక్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు'

బంగ్యానాయక్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్, నాయకులు

గరిడేపల్లి, డిసెంబర్ 22: మండలంలోని సోమ్లాతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బంగ్యానాయక్ మృతి తీరని లోటని పార్టీ మండలాధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్ అన్నారు. బంగ్యానాయక్ ఆదివారం అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకొని భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణనాయక్ మాట్లాడుతూ.. బంగ్యానాయక్ మృతి బాధాకరమని, వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీలవెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ కుక్కనూరు అంజయ్య, షేక్ దస్తగిరి, సీనియర్ నాయకులు కె.వెంకటనారాయణ, గుగులోతు జమ్ము, రవీందర్‌నాయక్, భూక్య వెంకట్‌నాయక్, వెంకటరమణ, శ్రీనునాయక్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'పేదల సమస్యలపై సీపీఐ పోరాటం'

హుజూర్‌నగర్, డిసెంబర్ 22: పేదల సమస్యలపై పోరాడుతున్న ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీపీఐ 100 వసంతాల ఉత్సవాల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 26న ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామగ్రామాన సీపీఐ జెండాను ఎగురవేస్తామని తెలిపారు. 30న నల్లగొండలోని ఎన్జీ కాలేజీ మైదానంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరిశ్రమ అభివృద్ధిలో కార్మికుల కీలక పాత్ర

● నాగార్జున సిమెంట్స్ ఎండీ గౌతమ్

ఉద్యోగులకు అవార్డులు అందజేస్తున్న ఎండీ గౌతమ్

మఠంపల్లి, డిసెంబర్ 22: నాగార్జున సిమెంట్స్ పరిశ్రమ స్థాపించి 41 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఎండీ కలిదిండి గౌతమ్ మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా పరిశ్రమ అభివృద్ధిలో కార్మికులు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ సందర్భంగా 30 సంవత్సరాలు పైబడి పరిశ్రమలో పనిచేసిన ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. సామాజిక బాధ్యతగా పరిశ్రమ పరిధిలోని మట్టపల్లి, గుండ్లపల్లి, సుల్తాన్‌పురం తండా, రామచంద్రాపురం తండాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాజులు, ఈడీ ఉత్కల్ గోరాడియా, రూప, యూనిట్ హెడ్ చంద్రశేఖర్, రఘువర్మ, హరీశ్‌రావు, కమలేశ్, హేమచంద్ర, బాబు, సతీశ్, దస్తగిరి, చక్రధర్, కేశవరాజు, శ్రీనివాసచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

● సీఐటీయూ నాయకుడు యాకూబ్

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు యాకూబ్

గరిడేపల్లి, డిసెంబర్ 22: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకుడు షేక్ యాకూబ్ డిమాండ్ చేశారు. ఆదివారం గరిడేపల్లిలో జరిగిన గ్రామ పంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు 2 జతల యూనిఫామ్స్ అందించాలని, కార్మికులకు భద్రత కల్పించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, నాగరాజు, రామారావు, సైదులు, అంజిబాబు, శ్రీను, లక్ష్మతిచారి, ముత్తయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'క్రీడలతో శారీరక దృఢత్వం'

కోదాడ రూరల్, డిసెంబర్ 22: క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని మండల విద్యాధికారి ఎండీ.సలీంషరీఫ్ అన్నారు. ఆదివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో కోదాడ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా త్వరలో కోదాడలో నిర్వహించనున్న కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల స్థాయి కోదాడ ఇంటర్ స్కూల్ క్రికెట్ చాంపియన్ షిప్ సీజన్–3 నిర్వహణపై సంఘం సభ్యులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు ఎస్‌కే.సిద్ధిక్, చందా శ్రీనివాసరావు, ఖాజా మియా, నాగేశ్వరరావు, తుమ్మల సురేశ్, సైదులు, జబ్బర్, బుల్లయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పారదర్శకంగా చేపట్టాలి

● తాసీల్దార్ శ్రీనివాస్‌రావు

నూతనకల్: సర్వేను పరిశీలిస్తున్న తాసీల్దార్ శ్రీనివాస్‌రావు

నూతనకల్, డిసెంబర్ 22: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు సిబ్బందికి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని బక్కహేమ్లా తండాలో ఇండ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన వివరాలను అంశాల వారీగా నమోదు చేయాలని తెలిపారు. దరఖాస్తుదారుల పూర్తి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సర్వే పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

హుజూర్‌నగర్: పట్టణంలోని 19 వార్డులో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను నిర్వహించారు. ఎన్‌రోల్‌మెంట్ అధికారి నాగేశ్వర్‌రావు సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అట్లూరి మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నాణ్యమైన విద్యను అందించాలి

● డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్

నల్లగొండ/రామగిరి, డిసెంబర్ 22: ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదల డిమాండ్స్ నెరవేర్చాలని కోరుతూ డీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఆమరణ నిరాహార దీక్ష ఆదివారం మూడో రోజు కొనసాగింది. కార్యక్రమంలో పాల్గొన్న విశారదన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారి సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి విద్యతో పాటు ఉచిత వైద్యం, ఉపాధి అవకాశం, భూమి కేటాయింపు, ఇంటి నిర్మాణానికి నిధులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, కోకన్వీనర్లు వెంకన్న, గిరి, ఎల్లయ్య, మహేశ్వరాచారి, కృష్ణయ్య, వినోద్, సురేశ్, సుధాకర్, పరమేశ్ పాల్గొన్నారు.

ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

● బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్

మిర్యాలగూడ, డిసెంబర్ 22: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించి.. ఇప్పటి వరకు దానిపై స్పష్టత ఇవ్వకపోవడంతో గ్రామపంచాయతీల్లో పోటీ చేయాలనుకున్న బీసీ అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి గంగాధర్, గోవాడ కిరణ్, అనిల్, సైదులు, రమేశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

'ప్రజావాణికి సకాలంలో హాజరుకావాలి'

నూతనకల్, డిసెంబర్ 22: స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I, PARVATANENI SRINIVASA RAO S/O Nagabhushana Rao. R/o. Plot No:101, Himagiri colony Road No:1, DVK Road, Nalgonda 508001. I, have chang my sur name to PARVATHANENI SRINIVASA RAO (New sur name) S/o Nagabhushana Rao.

CHANGE OF NAME
I, KALYANI PARVATANENI W/o Srinivasa Rao. R/o.Plot No:101, Road No:1, Himagiri colony, DVK Road, Nalgonda 508001. I,have chang my sur name to KALYANI PARVATHANENI (New surame) W/o Srinivasa Rao.

EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount

నమస్తే తెలంగాణ
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059
మిర్యాలగూడ : 9182777059